

# భ్రమ

శ్రీ కాజ వెంకటపద్మనాభ రావు

ఒంటిగంట అవుతుంది. ఎండతీక్షణంగా కాస్తోంది. వడగాలి తీవ్రముగా వీస్తోంది. రోడ్డుమీద తారు కరుగుతోంది. జనసంచారం వీధులలో తక్కువగా వుంది. ప్రతి ధనికునియింటా నీళ్లు కారుచున్న వుత్తవేళ్లచాపలూ, ఎలిట్రిక్ ఫాన్ బీదలు వేడికి ఆగలేక తమవంటి మీద గుడ్డలను నీళ్లతో తడుపుకుంటూ, వుదర పోషణార్థమై కొందరు తమతమ పనులలో నిమగ్నులై వున్నారు; మరికొందరు పనులకొరకు తిరుగుచున్నారు.

అలాంటి సమయమున సుబ్బన్న పోర్టు స్టేషను దగ్గర 'రిక్షా' పట్టుకొని రైలుకొరకు నిరీక్షిస్తుంన్నాడు. అతడు పొద్దుటినుండి 'రిక్షా' లాక్కుంటు కాళ్లు పడిపోయేటట్లు వూరంతా తిరిగాడు. పాపం! ఎక్కడా బాడుగదొరకలా అనాడు తిండికి అతనిదగ్గర రాగికాని అయినా లేదు. ఆకలి అతనిని దహింస్తోంది. ఎక్కడనైనా అప్పుతీసుకుందా మంటే ఊరికి అతనికి కొత్త అప్పు ఎలా దొరుకుంది అతనికి? ఆనాడు అతడు బాడుగ సంపాదించాలి. అతను తినాలి. రాత్రి 'రిక్షా' యజమానికి 'పావలా' అద్దె చేతిలో పెట్టకపోతే రేపు బండి యియ్యడు. 'ఎలాగా యీరోజు?, అంటూ ఆలోచిస్తున్నాడు.

ఇంతలో రైలు స్టేషనులో ఆగింది. కొద్దిమందే రైలుదిగారు. వారు 'వోవరు బ్రిడ్జి'దిగి రిక్షావాళ్ళ మాటలు వినిపించుకోకుండా వెళ్లిపోతున్నారు. అందులో ఒకాయన ఓపెద్ద ఉద్యోగిలాగ కలిపిస్తోంన్నాడు-దర్జాగా సుబ్బన్న రిక్షా ఎక్కి పోనియ్యమన్నాడు. సుబ్బన్నకు ఎక్కడలేని సంతోషం వొచ్చింది. పొద్దుననుండి ఆసిస్తున్న బాడుగ దొరికింది. తన ఆకలి పోగొట్టుకోవచ్చు! అనుకున్నాడు.

ఆ ఎండలో రిక్షా యీడ్చుకుంటూ పోతున్నాడు సుబ్బన్న అతని శరీరమునుండి చెమటకారి, ఆ వేడిగాలికి మాయమవుతోంది. కరిగినతారు చినిగిన చెప్పులగుండా అరికాలికి అంటుకుంటుంది. ఆకలి బాధలో ఆతనికి ఏ బాధా తెలీటంలేదు. ఉద్యోగి తొందర పెట్టుతుంటే, యింజనులాగ రొప్పుకుంటూ పరుగెత్తుతున్నాడు సుబ్బన్న. అతనిని తప్పించుకొని ఓగుఱ్ఱం, బండి లాక్కుంటూ నురుగులు కక్కుతూ పరుగెత్తుతోంది. దానికీ యితనికీ భేదం......?

దాదాపు తంబుశెట్టివీధి చివరుదాక వొచ్చారు. ఓయింటి దగ్గరబండీ ఆగింది. సుబ్బన్న రొప్పుకుంటూ చెమట తుడుచుకొంటుంన్నాడు. డాక్టరు సుబ్బన్న చేతులో అణాన్నర పెట్టాడు.

"అయ్యా! మైలు పైనలాగాను. దయచేసి మూడు అణాలు అన్నాయివ్వండి" అన్నాడు సుబ్బన్న"

'అంతకంటె ఎక్కువ యియ్యనుపో.' అని కఠినంగా ఆతనివంక చూస్తూ యింటిలోకి వెళ్లిపోతున్నాడు డాక్టరు.

ఆ అన్యాయానికి సుబ్బన్నకు కోపం వొచ్చింది. 'దానం యిస్తోన్నట్లు యిస్తున్నారు. ఇదికూడా తీసికోండి' అని ఆ అణాన్నర యియ్యబోయినాడు.

డాక్టరికి కోపంవచ్చింది. 'you rogue' అని సుబ్బన్న చెంపమీద గట్టిగా దెబ్బ కొట్టాడు.

సుబ్బన్నకు పట్టరానికోపం వొచ్చింది. డాక్టరు అతనిని ఎంతుకు కొట్టాలి? అతనేమి తప్పుచేశాడు? కష్టపడి దానికి ప్రతిఫలం అడిగాడు. అదితప్పా? అతనికి మట్టుకు నీతిలేదూ? జాతి లేదూ? ఆత్మలేదూ? హృదయం లేదూ? డాక్టరు గొప్పవాడైతే అతనికేమి జరిగింది? అతని ఆకలపోయిందా?......ఆ అవమానం భరింపలేక పోయాడు. సుబ్బన్న బలహీనత మాయమయింది. వేడిరక్తం పొంగింది. గట్టిగా డాక్టరు చెంపమీద ఓ దెబ్బకొట్టాడు. దీనితో ఓపన్ను వూడింది. రెండు పన్నులు కదిలాయి. రక్తం ధారగాకార్తుంది. ఆ దృశ్యాన్నిచూస్తూ సుబ్బన్నకోపం తగ్గించుకుంటున్నాడు.

పోలీసు స్టేషనుకు 'ఫోను'ద్వారా యీ సంగతి పోయింది. సైకలుమీద ఓ పోలీసు అక్కడకు వొచ్చాడు. డాక్టరు సంగతిచెప్పాడు. పోలీసు సుబ్బన్నని లాటీతో మోకాళ్లమీదా, మోచేతుల మీదా బాగాబాది స్టేషనుకి రమ్మంన్నాడు. కుంటుకుంటూ 'రిక్షా' లాక్కొని పోలీసువెంట వెళ్లాడు. సుబ్బన్నఅతనేమి నేరంచేశాడు?

* * *

సుబ్బన్నది ఒరంగల్ దగ్గర ఓపల్లె కాపుకులం. పొలం కొద్దిగావుంటె అప్పుకింద అయిపోయింది. భార్యను యిద్దరు పిల్లలను పోషించాలి. కొన్నిరోజులు అక్కడక్కడ కూలిచేసి సంసారం గడిపాడు. కూలి మందగించింది. పనిలేదు. తిండి 'లేదు. ఎలా కుటుంబాన్ని పోషించటం?...సుబ్బన్న చదువుకున్నవాడు కాకపోయినా, మంచి చెడ్డ తెలుసుకోనే జ్ఞానం, ఆలోచన శక్తి వున్నాయి. ఈ ప్రాంతాలనుండి చాల పట్నంపోయి 'రిక్షా' లాగి డబ్బు సంపాదిస్తోన్నారను, తనూ పోయి కష్టపడితే ఫలితం వుంటుంది అనుకున్నాడు.

ఇంకా కొంచెము ఆలోచించి అది చాల అగౌరవం అనుకున్నాడు. తన తోటి మనుష్యులను బండి ఎక్కించుకొని దున్నపోతులాగ, ఎద్దులాగ లాగుతూ— తన జాతి చూస్తుంటె మానం చంపుకొని— వీధుల వెంట పరుగెత్తాలి ఆ నీచవృత్తి ఎలా చేయటం? ఎక్కే మష్యులు ఎలా ఎక్కుతారో అనుకున్నాడు. తన సోదర మానవుని అగౌరవ పరచటం, తనను తను అగౌరవ పరచటం అని తెలిసుకొనే అంత బుద్ధి వారికి వుండదూ?...అలాటి అమానషపు కార్యం చేయటం కంటె క్షుదాగ్నిలో మాడిపోవటం మంచిదనుకున్నాడు.

అతని సంగతి సరె. అతని ఆలి బిడ్డల సంగతి? వారి క్షుద్బాధ ఎలా తీరటం? వారిని పోషించవలసిన బాధ్యత అతనిమీద లేదూ? ...డబ్బు సంపాదించాలి ఎలా?

అతనికేది పాలుపోలా. ఇంతలో అతనికొక మంచి ఆలోచన తట్టింది. 'బండ్ల బస్తాలు ఎరువు బస్తాలు— యివి అన్నీ బండ్లమీద వేసుకొని మనుష్యులు లాగటంలా? సోదరులను కఠిన హృదయులై అగౌరవించు మానవులు వాటికంటె ఏమి అధికము? అలాటి వారిని లాగితే తప్పేముంది? నిన్న మేము తాటిమొద్దును బండికి కట్టి లాక్కొరాలా? అలాగే వారు కూడా లాగేది అని ఆలోచించి పట్నం వెళ్లటం నిశ్చయించుకున్నాడు.'

'ఇక్కడ పనేమీ లేదు. పట్నంలో పని దొరుకుతుందిట. నేను వెళ్లి సంపాదించి డబ్బు పంపుతాను. కొన్నాళ్లకు మీరుకూడ అక్కడికి రావొచ్చు' అని తన అభిప్రాయాన్ని భార్యతో చెప్పాడు, సుబ్బన్న.

భర్తను వొదిలి వుండటం భార్యకు యిష్టంలా. ఆమె అతనిని చూడకుండా వుండలేదు. అతనూ అంతే. కాని తిండికి ఏర్పాటు? ఆమె విచార హృదయంతో ఏమీ చెప్పక ఆలోచిస్తుంది. అతనికి జాలివేసింది.... ఆమెతో మాటలు చెప్పుతుంటే ఆకలే కనపడేది కాదు, అతనికి. తన ముద్దుబిడ్డలు 'నాయనా' అంటూ వొచ్చి చెరియొక పక్క కాళ్లని కౌగిలించుకుంటే అతడు అన్ని కష్టములను మరచిపోయేవాడు. వారిని వొదిలిపెట్టి ఎలా వుండటం?...మరి వొదిలిపెట్టి వుండాలి. తప్పని సరి.

'నేను రెండు నెలలలో మిమ్మల నందరినీ అక్కడకు తీసుకో పోతాను. నేనిక్కడ వుంటే ఆకలి ఎలా పోతుంది? అన్నాడు. అతని ముఖంలో విచారం కనిపిస్తుంది.

'సరే కానియ్యి. దేముడిమీద భారం వేద్దాం. మరి రైలు చార్జికి డబ్బు కావాలి కాబోలు. ఈ పట్టెడ అమ్మి డబ్బుతీసికోండి అని తనడలో బంగారు పట్టెడతీసి యిచ్చింది భర్తకు.

అతని హృదయం మంచు గడ్డ లాగా కరిగి పోయింది. అమాంతముగా భార్యను కౌగిలించుకొని అతని చెంపను ఆమె చెంపకు ఆనించాడు...ఆమె కంటిధారను తన చినిగిన తలగుడ్డతో తుడిచాడు.

వారు ధనములో చదువులో బీదవారు. ప్రేమలో కోటీశ్వరులు. ఈ దయా రహితమైన ప్రపంచంలో బ్రతుకుటకు అది ఒకటే వారికి కారణం!

* * *

సుబ్బన్నకు వయస్సు ముప్పై సంవత్సరాలుంటాయి. బలిష్టమైన శరీరం. ఎర్రగా అందంగా వుంటాడు.

అతడు చెన్నపట్నం వొచ్చి నాలుగు నెలలయింది. ఎండలో 'రిక్షా' లాగటం మూలాన శరీరం నలుపు తిరిగింది. మొద్దుబారింది. వేళకు తిండి అందటం లేదు. బలం నసించి పోతోంది. గుండెలో వొవిధమైన నొప్పి ఏర్పడ్డది. బాడుగలు సరిగా దొరకటం లేదు. తిండికూడ ఒకప్పుడు మానుకొని మిగిల్చిన కొద్ది డబ్బు రెండుసార్లు యింటి పంపాడు...పంపి చాల రోజులయింది. ఇంటిదగ్గరనుండి ఉత్తరం వొచ్చింది డబ్బు పంపమని. వారు ఎంత యిబ్బంది పడుతుంటే రాశారో! ఆ రోజు అతని తిండికే డబ్బు లేక పోయింది...ఆ సాయంకాలమే అతడు స్పృహతప్పి పోలీసు స్టేషనులో పడివున్నాడు.

* * *

'నీవు డాక్టరు గార్ని కొట్టావా? అని అడిగాడు మేజస్ట్రేటు.

'వారే ముందు కొట్టారండీ'

అని సుబ్బన్న సమాధానం.

'నేను అడిగిన ప్రశ్నకు సరిగా సమాధానం చెప్పు. నువ్వు కొట్టావా'?

సుబ్బన్నకు నరకంలో వున్నట్లుగా వుంది. న్యాయం అనేది అతనికి కనిపించాలా.

'ముందు వారు కొట్టితే, తరువాత నేను కొట్టా, సుబ్బన్న చెప్పాడు.

పక్కన వున్న గుమాస్తాలు పోలీసులు, ప్లీడరు 'వీడు అంత గొప్ప ఉద్యోగిని కొట్టటమే! ఎంత మదం!' అనటం అతనికి వినిపించాయి.

అతడు తన శరీరాన్ని తేళ్ళు కుట్టుతున్నట్లు బాధ నొందాడు. బోనులో నుండి ఎపుడు బయట పడతానా అని ఆతృత పడ్డాడు. అతనికి మానవజాతి పైన అసహ్యం వేసింది. వారికి కనిపించకుండా ఎక్కడైనా కొన్ని రోజులుంటే బాగుండు ననిపించింది.

మేజస్ట్రీటు దీర్పు చెప్పాడు.

"సుబన్నకు ఆరునెలలు కఠిన శిక్ష"

* * *

సుబ్బన్న జైలులో విచారం హృదయముతో కూర్చున్నాడు. ప్రపంచము తనకు చేస్తున్న అన్యాయానికి కోపించాడు. ఏమి లాభం?

అతని నేత్రములు జైలు కడ్డీల గుండ ఆకాశాన్ని అర్థం లేకుండా చూస్తున్నాయి; అతని హృదయం అతని భార్యా పుత్రులను చూస్తోంది.

అతని భార్యా తిండిలేక చిక్కి- వోపికలేక- ఆ చినిగిన యీతాకు చాపమీద పడివుంది. అమాయకపు పసికూనలు- ఒకరు తిండికి, యింకొకరు పాలకు- ఏడుస్తున్నారు. తల్లికంటి ధారవారికి సమాధానం.

ఈ దృశ్యాన్ని సుబ్బన్న చూడలేక పోయాడు. వారిని కౌగిలించుకుందామని లేచి పరుగెత్తాడు. గేటు యినుప కడ్డీలు అతని తలను 'ఢీ' కొన్నాయి. తల పగిలి నెత్తురు కారుతోంది. ఆ నొప్పికి అతనికి అది 'భ్రమ' అని తెలిసింది.


## జీవబ్రహ్మైక్య రాజయోగ సారామృతము

ఇది కడప శ్రీపరమహంస సచ్చిదానంద యోగీశ్వరులవారిచే ముద్రింపబడినది.



1276-పుటలు, 48-పటములుగలది, మూడవ కూర్పు.

| | | |
|---|---|---|
| కాలికోబయిండు | రూ. | 4-4-0 |
| గూఢార్థ సంగ్రహ సహిత శ్రీ భగవద్గీత | రూ. | 2-4-0 |
| శ్రీ కబీర్‌దాసు చరిత్రము | రూ. | 2-4-0 |
| శరీర దేవాలయ రహస్యార్థపారిజాతము | రూ. | 0-6-0 |

## చిత్రగుప్త ఆఫీసు

సౌకారుపేట పోస్టు, మదరాసు.